ఓం నమో భగవతే శ్రీరమణాయ

# రమణభాస్కర

## (జిన్నూరులో శ్రీనాన్నగారి ప్రవచనము, 23-9-96)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

శరీరం పుట్టినరోజు పుట్టినరోజు కాదు, శరీరం మరణించిన రోజు మరణించిన రోజు కాదు. మనందరము ఏమనుకొంటున్నాము అంటే శరీరం పుట్టినపుడు మనం పుట్టాము అనుకొంటున్నాము అది నిజం కాదు అని చెపుతున్నారు. దేహం పుట్టటం ఒక తలంపు, దేహం మరణించటం ఒక తలంపు. ఇవి కేవలము స్వప్న సమానమే. గాఢనిద్రలో స్వప్నాలు వస్తూ ఉంటాయి. ఆ స్వప్నం ఎంత అసత్యమో ఈ జీవితం కూడా అంతే అసత్యము. అది పొట్టిగా ఉంటుంది ఒక గంటో రెండు గంటలో ఉంటుంది ఈ జీవితం 60 సం.లో, 70 సం.లో ఉంటుంది కాని అది ఎంత అసత్యమో ఇది కూడా అంతే అసత్యం. శరీరం జన్మించినపుడు నీవు జన్మించలేదు అంటున్నారు మరి ఎప్పుడు జన్మించాము. నీకు వ్యక్తిభావన ఎప్పుడైతే కలిగిందో అంటే మిథ్యానేను ఎప్పుడైతే పుట్టిందో అప్పుడు మనం జన్మించాము. శరీరం మరణించినపుడు మనం మరణించము. వ్యక్తిభావన ఎప్పుడైతే నశించిందో అప్పుడు మనం మరణిస్తాము. శరీరం పుట్టుక పుట్టుక కాదు, శరీరం మరణం మరణం కాదు. రెండూ తలంపులే. వ్యక్తిభావన ఎప్పుడైతే పుట్టిందో అప్పుడు నీవు పుట్టావు. వ్యక్తిభావన ఎప్పుడైతే నశించిందో అప్పుడు నీకు బ్రహ్మానుభవం కలుగుతుంది. వ్యక్తిభావన నశించాలంటే వ్యక్తిభావన విజృంభించకుండా ఉండే పనులు చేయాలి. పూజ, జపం చేసినంత మాత్రంచేత వ్యక్తిభావన నశించదు. పూజ, జపం, ధ్యానం ఇవి అన్నీ మనస్సు అణగటానికి. వ్యక్తిభావన పెరిగే మాటలకు, చేతలకు, ఆలోచనలకు మనం దూరంగా ఉండాలి. రూపదృష్టి, నామదృష్టి లేకుండా పని చేస్తే వ్యక్తిభావన నశిస్తుంది.

నీవు ఏ వస్తువును పొందటం కోసం ప్రయత్నం చేస్తున్నావో అది ఎక్కడో దూరాన లేదు, నీ హృదయంలోనే ఉంది. నీవు సాధన చేసి ఏదో ఒక మార్గములో ప్రయాణించి దేహగతమైన నేనును తొలగించుకొంటే ఆ వస్తువు నీకు వ్యక్తమవుతుంది. పూర్వజన్మలో నీవు ఏ మార్గములో ప్రయాణం చేసావో అది ఇప్పుడు నీకు సహజంగాను, తేలికగాను అనిపిస్తుంది. అహంకారముతో సహవాసం విడిచిపెట్టమని చెపుతున్నారు. గాఢనిద్రలో మానవుడు అహంకారముతో సంబంధం లేకుండా ఉంటాడు. జాగ్రదావస్థలోనికి వచ్చిన తరువాత వాడి అహంకారము గొడవ తప్పించి ఇంకేమి వాడికి అక్కరలేదు. మనం ఎంతో కష్టపడి కృషి చేస్తే భక్తి వస్తుంది కాని అది అంత తేలికగా వచ్చే సామాగ్రి కాదు. దీనికి గురువు అనుగ్రహం అవసరము. వైరాగ్యం లేకపోతే భక్తి రాదు, భక్తి లేకపోతే జ్ఞానం లేదు. జ్ఞానం లేకపోతే మోక్షం లేదు అని భగవంతుడు చెప్పాడు.

నేను ఇంతసేపు పూజ చేసాను, అంతసేపు జపం చేసాను, యాత్రలకు తిరిగాను అని అనుకొంటున్నావు. ఆ పూజ చేసిన నేను ఎవడు? జపం చేసిన నేను ఎవడు? యాత్రలు చేసిన నేను ఎవడు? వాడిని తీసి ఒక ప్రక్కన పెడితేనేగాని నీకు మోక్షం రాదు అన్నారు రమణాచార్యులు. ఎంతసేపు ఈ గొడవలు ఏమిటి? నీవు నిజంగా భక్తుడవు అయితే అరగంట పూజ చేసాను, గంట జపం చేసాను, యాత్రలకు వెళ్ళాను ఈ గొడవలు కాదు. వీటి అన్నింటిలోనూ నేను ఉన్నాడు. ఆ నేనును తీసివేస్తే గాని నీకు మోక్షం కలుగదు. ఆ నేనుతో సహవాసం ఉన్నంతకాలము పుడుతూ ఉండాలి, మరణిస్తూ ఉండాలి మరల తిరిగి పుడుతూ ఉండాలి. ఈ జననమరణ ప్రవాహము నుండి విడుదల అయ్యే అవకాశం లేదు. తన హృదయంలో ఉన్న బ్రహ్మము ఎవడికైతే ప్రత్యక్షంగా

అనుభవం లోనికి వచ్చిందో వాడు సద్గురువు. ఎవడైతే తన చూపుద్వారా, మాటద్వారా, చేతద్వారా, మౌనం ద్వారా ఇతరులను అనుగ్రహిస్తున్నాడో వాడు సద్గురువు.

మన మనస్సు భగవంతుడు చెప్పిన మాటలు వినదు. విన్నట్లు నటిస్తుంది. అయితే మనం ఎవరు చెప్పినట్లు వింటున్నాము అంటే అహంకారము చెప్పినట్లుగా వింటున్నాము. జ్ఞాని యొక్క మనస్సు వాడు చెప్పినట్లుగా వింటుంది. వాడు కదలమంటే కదులుతుంది లేనిచో స్థిరంగా ఉంటుంది. కారణం ఏమిటి అంటే తాను ఎవడో తనకు తెలియబడింది కాబట్టి బ్రహ్మానుభవం కలిగింది కాబట్టి వాడి మనస్సు వాడు చెప్పినట్లుగా వింటుంది అంటే సేవకుడిలాగ పని చేస్తుంది. ఇప్పుడు మన మనస్సు మన మీద పెత్తనం చేస్తుంది. మన మనస్సు మనకు యజమానిగా ఉంది, మనం నౌకర్లుగా ఉన్నాము. జ్ఞానం వచ్చిన తరువాత మనస్సు నౌకరుగా మనం యజమానిగా ఉంటాము. ఏ శరీరమును, మనస్సును, బుద్ధిని, తెలివిని నీవు అనుకొంటున్నావో అవి అన్నీ కూడా జడవస్తువులే. నీ లోపల ఉన్న చైతన్యము వలన ఇవి అన్నీ సజీవంగా ఉన్నట్లు నీకు అనిపిస్తోంది. వీటిలో నుండి విడువడితే నీవు ఎవరో నీకు తెలుస్తుంది. దేవుడు ఉన్నాడా, లేడా అని విచారణ చేసే బదులు నీ అహంవృత్తిని తొలగించుకొంటే వెంటనే నీ లోపల ఉన్న సద్వస్తువు నీకు వ్యక్తమవుతుంది.

నువ్వు మనస్సువు కాదు, నువ్వు అహంకారము కాదు, నువ్వు బుద్ధివి కాదు అని శాస్త్రము చెపుతోంది, భగవంతుడు చెపుతున్నాడు. పరమేశ్వరుడు చెపుతున్నప్పటికి నీవు ఏదైతే కాదో దానిని పట్టుకొని వ్రేలాడుతున్నావు కాని దానిని విడిచిపెట్టటానికి ప్రయత్నం చేయటం లేదు. సాధన చేసే వారు కూడా అహంకారమును విడిచిపెట్టకుండా అహంకారముతో భగవంతుని తెలుసుకోవటానికి ప్రయత్నం చేస్తున్నారు. అహంకారము నశిస్తే గాని నీ హృదయంలో ఉన్న భగవంతుడు నీకు వ్యక్తం కాడు. శరీరం మరణించేలోపు నీ హృదయంలో ఉన్న సత్యమును అనుభవంలోనికి తెచ్చుకొంటే సత్యమునకు మరణం లేదు కాబట్టి శరీరం మరణించేటప్పుడు నేను మరణిస్తున్నాను అనే భావన గాని, తలంపుగాని నీకు రాదు. గుణబద్ధుడు గుణాతీతుడితో స్నేహం చేయాలి. అలా స్నేహం చేయగా చేయగా వీడు కూడా గుణాతీతుడు అవుతాడు. మనలో ఉన్న పునర్జన్మకు కారణమైన హేతువులు నశించటానికి సత్పురుషుల సహవాసం అవసరం. నీఅంతట నీవు సాధన చేసి వాటిని తొలగించుకొంటే సరే లేకపోతే సజ్జన సాంగత్యం వలన నీలో ఉన్న పునర్జన్మ హేతువులు నశిస్తాయి.

అహంకారమును పోగొట్టుకోవటానికే నీ సాధన అంతా. సత్యమును తెలుసుకోవటానికి కాదు. సత్యం నీ హృదయంలో ఉంది. అహంకారము పోయిన వెంటనే సత్యం నీకు వ్యక్తమవుతుంది. దేహమును ప్రారబ్ధమునకు విడిచిపెట్టు. కష్టం వచ్చినా, సుఖం వచ్చినా అది నిత్యముగా ఉండదు. కష్టసుఖాల మధ్య నలిగిపోకుండా నీ హృదయంలో ఉన్న వస్తువును తెలుసుకోవటానికి ప్రయత్నం చెయ్యి. పైకి అందరిలాగే ఉన్నట్లు నటించు. నీవు చేసే సాధన ఇతరులకు తెలియనక్కరలేదు. ప్రయత్నం మటుకు లోపల జరుగుతూ ఉండాలి. విచారణగాని, సాధనగాని బయట చేసేది కాదు లోపల చేయాలి. అలా చేయగా చేయగా అహంకారం నశిస్తుంది. అప్పుడు దాని మూలం తెలియబడుతుంది. నీవు వెతికే దేవుడు అహంకారం యొక్క మూలంలోనే ఉన్నాడు. ఆ మూలం తెలిసినపుడు దేవుడు తెలియబడతాడు. నిరంతరము దేహచింతన వద్దు. దేహం చుట్టూ తిరగవద్దు. భక్తిని అభ్యసించు. ఏదో ఒక అవతారపురుషుని ఉపాసన చెయ్యి. అలా ఉపాసన చేయగా చేయగా దేహబుద్ధికి దూరమవుతావు, ఆత్మబుద్ధికి దగ్గరవుతావు. నీవు దేహాన్ని చింతిస్తే దేహానికి దగ్గరవుతావు, దేవునికి దూరమవుతావు. నీవు దైవాన్ని చింతిస్తే దేవునికి దగ్గరవుతావు, దేహానికి దూరమవుతావు.

భగవంతుడు ఏ స్థాయిలో ఉండి మాటలు చెపుతున్నాడో ఆ స్థాయికి మనం ఎదిగితేగాని భగవంతుడు చెప్పే మాటలు పూర్తిగా మనకు అవగాహనకావు. భగవంతుని మాటలు మనం అర్థం చేసుకోవటానికి ప్రయత్నం

చేస్తున్నప్పటికీ అర్థం అవ్వకుండా మన మనస్సులోని వాసనలు అడ్డు వస్తాయి. దేవుడు ఏ పని చేయమని చెప్పాడో ఆ పని చేస్తూ ఎలా జీవించమని చెప్పాడో అలాగ జీవిస్తూ ఉంటే దేవుడు మనకు ఎరుకపడతాడు. మనకు పవిత్రత, ప్రవీణత, వినయం కనుక ఉంటే భగవంతుడు తెలియబడతాడు. నీ మనస్సు అంతర్ముఖం అవుతూ ఉంటే మనస్సు వలన వచ్చే చిల్లర గొడవలు అన్నీ అణిగిపోతాయి. సహనం, ఓర్పు ఉన్నవారికి శక్తి కలుగుతుంది. ఆ శక్తి వలన పరమేశ్వరుడు వ్యక్తమవుతాడు. ఎవరికైనా మనం సహాయం చేస్తే వారు తిరిగి మనకు సహాయం చేయాలి అనుకొంటాము. మీరు అలా అనుకోవద్దు. ఎదుటివారికి మనం సహాయం ఎప్పుడు చేస్తాము. కష్టాలలో ఉన్నప్పుడు చేస్తాము. వారు మీకు సహాయం చేయాలంటే మీకు కష్టాలు రావాలి. అంటే మీకు తెలియకుండానే మీకు కష్టాలు రావాలి అని మీరే కోరుకొంటున్నారు. ఎదుటివారికి మీరు సహాయం చేయగలిగితే చేసి మర్చిపోండి. అంతేగాని వారు తిరిగి మీకు సహాయం చేయాలి అని అనుకోవద్దు. మీరు ఏపని చేసినా ఈశ్వరుని ప్రీతి కోసం చేయండి. ఎవరైనా పొగిడితే పొంగిపోకుండా, అవమానిస్తే కృంగిపోకుండా సమానంగా ఉంటే అప్పుడు పరమేశ్వరుడు మీ మనస్సును లోపలకు గుంజుకొంటాడు. లోపలకు గుంజుకోవటమే కాదు తన స్వరూపాన్ని ఇస్తాడు. ఎన్ని కష్టసుఖాలు, లాభనష్టాలు వచ్చినప్పటికి నీ జీవిత గమ్యం పరమేశ్వరుడే. నీవు పూజించవలసింది, నీవు ఆరాధించవలసింది, నీ గోల్ పరమేశ్వరుడే. ఆయన కోసం జీవిస్తూ ఉంటే, నీ తలంపులు అన్నీ ఆయన చుట్టూ తిరుగుతూ ఉంటే నిన్ను అనుగ్రహించి ఆయన స్వరూపాన్ని ఇస్తాడు.

ఎక్కడయితే అహంవృత్తి నశించిందో అక్కడే నీ హృదయంలో ఉన్న నిజం నీకు వ్యక్తమవుతుంది. ఎప్పుడో, ఎక్కడో వస్తుంది అని నీవు అనుకొంటున్నావు. ఎప్పుడో వస్తుంది అనుకొన్నది ఇప్పుడే ఉంది, ఎక్కడో ఉంది అనుకొన్నది ఇక్కడే ఉంది. ఇప్పుడు లేదు, ఇక్కడ లేదు అని నీవు అనుకొంటే ఆ వస్తువును అగౌరవ పరచినట్లే. ఆ వస్తువు ఎప్పుడూ ఉంది, అంతటా ఉంది. నీవు కృషి చేస్తే దేవుని కృప కలుగుతుంది. దైవానుగ్రహం వలన వస్తువు తెలియబడుతుంది. మనం చేసే పని వలన, మాట్లాడే మాట వలన, మనకు వచ్చే ఆలోచనల వలన మన చైతన్య స్థాయి పెరుగుతూ ఉండాలి. అదే కాలంలో అవి సమాజమునకు ఉపయోగపడాలి. అది మానవ జన్మ అంటే. ఇలా జీవిస్తూ ఉంటే నీద్వారా లోకానికి మేలు జరుగుతుంది, నీ చైతన్య స్థాయి పెరుగుతుంది. నీవు మోక్ష సుఖం పొందుతావు. నీ శరీరం పడిపోక ముందే నీకు ఆత్మజ్ఞానం కలుగుతుంది. ఆత్మజ్ఞానం ఎందుకంటే ఆత్మజ్ఞానం లేకుండా ఆత్మ తెలియబడదు. దేనిని తెలుసుకొన్న తరువాత ఇంక తెలుసుకోవటానికి ఏమీ మిగలదో దానిని తెలుసుకోవటానికి ప్రయత్నం చెయ్యి.

అహంకారమును పట్టించుకోవద్దు. అహంకారముతో సహవాసం ఉన్నంతకాలం జన్మిస్తూ మరణిస్తూ జననమరణ ప్రవాహములో ఉంటావు. దానిని ఆదరణ చేయకపోతే అది నశిస్తుంది. అహంకారమును లెక్కచేయ వద్దు, దాని వంక చూడవద్దు. అది నీవు కాదు అని భగవంతుడు చెపుతూ ఉంటే దానికూడా వెళతావు ఎందుకు? దాని గొడవ వదిలెయ్యి. అహంకారమే నేను అని అనుకోవటం వలన నీహృదయంలో భగవంతుడు ఉన్నా నీకు తెలియటం లేదు. నీవు భగవంతుడు చెప్పినట్లు విను. భగవంతుని మాటలను అనుసరించు. అహంకారము చెప్పిన మాటలను అవలంబించవద్దు.

మనిషికి కర్తృత్వ బుద్ధి వలన దుఃఖం వస్తుంది. నేను గొప్పవాడిని అని అనుకోవద్దు, నేను తక్కువ వాడిని అని అనుకోవద్దు. ఇది నేను చేస్తున్నాను. నా వలననే అవుతోంది. నేను గొప్ప వాడిని అనుకొంటే నీకు గర్వం వస్తుంది, నేను తక్కువ వాడిని అనుకోవటం వలన నీకు దుఃఖం వస్తుంది. ఇది అంతా నీ మనస్సు యొక్క గారడీ. ఇటువంటి చిల్లర గొడవలలోనికి వెళ్ళకుండా నీ హృదయంలో ఉన్న ఈశ్వరుడిని అనుభవం లోనికి తెచ్చుకోవటానికి ప్రయత్నం చెయ్యి. నీ కాలమును పాడు చేసుకోవద్దు, నీ శక్తిని పాడు చేసుకోవద్దు. భగవంతుని

మీద భారం వేసి జీవించటం నేర్చుకోండి. అప్పుడు ఎంతటి విషాదం ఉన్నా ఎంత దుఃఖం ఉన్నా అప్పటికప్పుడు నశిస్తుంది. భగవంతుని మీద భారం వేసి పని చేస్తే పని సక్రమంగా జరుగుతుంది, కర్మ మిమ్మల్ని చుట్టుకోదు. చిత్తవృత్తి నశించాలి. చిత్తవృత్తి నశించకపోతే లోపల ఉన్న వస్తువు తెలియదు. నీ చిత్తం బాహ్యముఖంగా విజృంభించకుండా నిరోధించటానికి పూజ, జపం, ధ్యానం నీకు సహకరిస్తాయి.

నేను ఎవడను? అనే విచారణ కష్టం అని చాలామందిలో ఉంది. కొంత అభ్యాసం చేస్తే అది తేలిక అవుతుంది. నేను అనే తలంపు నీ హృదయంలో నుండి వస్తోంది. నేను అనే ప్రథమ తలంపు ఎక్కడ నుండి పుట్టి వస్తోందో అక్కడే దేవుడు ఉన్నాడు. నేను అనే ప్రథమ తలంపు వచ్చాకా ఇతర తలంపులు వస్తున్నాయి కాని నేను అనే తలంపు రాకపోతే ఇతర తలంపులు రావు. నేను అనే తలంపు ఎక్కడ అయితే పుట్టి వస్తోందో అక్కడకు దానిని ఉపసంహరించగలిగితే అక్కడ నేను అనే తలంపు నశిస్తుంది. అప్పుడు దానికి అధారంగా ఉన్న చైతన్యం తానుగా వ్యక్తమవుతుంది. భగవంతుని సంకల్పమే మన సంకల్పం, భగవంతుని ఇష్టమే మన ఇష్టం అనుకోవటం శరణాగతి మార్గం. శరణాగతి మార్గంలో ప్రయాణించిన మనస్సు నశిస్తుంది. సహజంగా కొంతమందికి దేవుడు అంటే నమ్మకం ఉండదు. అజ్ఞానం యొక్క వేగం వలన, తగిన పుణ్యబలం లేకపోవటం వలన దేవుని మీద విశ్వాసం ఉండదు. దేవుడు ఉన్నాడో లేడో నీకు తెలియకపోయినా నేను ఉన్నట్లు నీకు తెలుస్తోంది. ఆ నేను ఎవడో నీకు తెలిస్తే దేవుడు ఎవడో నీకు తెలుస్తాడు. అది విచారణ మార్గం. ఆ నేను ఎవడో నీకు తెలియకపోతే కోటి జన్మలు ఎత్తినా దేవుడు ఎవడో నీకు తెలియదు. శరీరం చనిపోయిన తరువాత ఏ నేను అయితే ప్రయాణం చేస్తోందో శరీరం చనిపోకముందే ఆ నేనులో నుండి బయటకు రావటమే మోక్షం.

మనం కొద్ది టైము పూజ, జపం అవీ చేస్తాము. మిగతా టైము అంతా ఈ అహంకారానికి మేత పెడతాము. అదే మనం చేసే తప్పు. నిరంతరము కాపుదలలో ఉండాలి. ఆలోచించి పని చేయి, ఆలోచించి మాట్లాడు. వివేకం పెంచుకో. ఏదైతే నీవు కాదో దానిలో నుండి విడిపోవటం నేర్చుకో. అదీ వివేకం అంటే. భగవంతుని మాటను ప్రమాణంగా తీసుకోండి. భగవంతునియందు ప్రేమ, పూర్ణమైన విశ్వాసం ఉంటే మన మనస్సు అందులో కరిగిపోతుంది. అహంభావనను లెక్క చేస్తే అది పొంగిపోతుంది. దానిని లెక్క చేయకపోతే దానికి వెళ్లే ఆహారం కట్ అయిపోతుంది. అప్పుడు అహంభావన కృశించిపోయి రాలిపోతుంది. భగవంతుడు మీకు ఇచ్చిన అవకాశములను భగవంతుని అనుగ్రహం పొందటం కోసం ఉపయోగించండి. మీరు ఏదైనా మంచి చేస్తే అది అంతా దేవుని బ్యాంకులో ఉంటుంది. నీ మరణానంతర జీవితంలో అది చెల్లుతుంది. మంచి చేసిన వాడికి దుర్గతి లేదు. మంచిని చూడటం, మంచి మాట్లాడటం, మంచిని శ్రవణం చేయటం వలన వారికి జ్ఞానం కలుగుతుంది అంటే భగవంతుడు వారికి బహుమానంగా తన స్వరూపమును ఇస్తాడు. గురువు శిష్యుడిని ఎలా సరిదిద్దుతూ ఉంటాడో చూడండి. ఒకసారి వివేకానందుడు దేవుని మీద పాట పాడుతూ ఉన్నాడు. ఆ కాలంలో ఆయన కొద్దిగా ఆర్థికంగా ఇబ్బందులలో ఉన్నాడు. పాట బాగానే పాడుతున్నాడు. కాని మధ్యలో ఆయన మనస్సు ఉద్యోగం గురించి ఆలోచిస్తోంది. అప్పుడు రామకృష్ణుడు అక్కడ నుండి వెళ్ళిపోయాడట. తరువాత వివేకానందుడు మీరు ఎందుకు మధ్యలో వెళ్ళిపోయారు అని రామకృష్ణుడిని అడిగాడు. నీ నోరు దేవుని గురించి పాడుతోంది. మనస్సు ఉద్యోగం మీదకు వెళుతోంది. ఆ తలంపు చూడలేక వెళ్ళిపోయాను అని చెప్పాడట. నోటితో పాడుతున్నావు. మనస్సుతో కాదు అంటున్నావు. మనస్సులో ఉన్న బలహీనతలు చూపించటానికి గురువు చేసిన పని అది. నీ మనస్సులో ఉన్న బలహీనతలు తొలగించుకోవాలి అని చెప్పటం కోసం చేసిన పని అది.

★

**(జిన్నూరులో శ్రీ నాన్నగారి ప్రవచనము 13-11-96)**